క్లుప్తంగా

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి ఒడ్డు పండగ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులతోపాటు దూర ప్రాంతానికి చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శరవేగంగా తలుపులమ్మ ఆలయ నిర్మాణం



ఆలయ నిర్మాణ పనులు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో తలుపులమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవగంగా కొనసాగుతున్నాయి. గ్రామస్తులు రూ.20 లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయం ఎదుటి భాగంలో మండపం నిర్మాణం చేపడుతున్నారు. ఆలయ నిర్మాణ పనులు మరో నెల రోజుల్లో పూర్తి కానున్నట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తెలిపారు. అనంతరం ఘనంగా ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

నారుశుద్ధితో తెగుళ్లు దూరం



నారుశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న సుదర్శన్

మాకవరపాలెం: ప్రకృతి సేద్య పద్ధతిలో వరి నారు శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్, గణపతి, లక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని జంగాలపల్లి, మాకవరపాలెం, తామరం, తదిర ప్రాంతాల్లో ఆదివారం వరినాట్లు వేసే రైతులకు ప్రకృతి సేద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజామృతంలో వరినారు మొద్దళ్లను శుద్ధి చేసి నాట్లు వేయించారు. నారుమొనలను తుంచి వేయడం ద్వారా కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. దీంతోపాటు కాలిబాటల తీయడంపై అవగాహన కల్పించారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతికి సంతాపం

చోడవరం రూరల్: ప్రజా గాయకుడుగా ప్రసిద్ధి గాంచిన గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్ మృతి పట్ల పౌరహక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. గద్దర్ తన గీతాలాపన ద్వారా ప్రజాయుద్ధ నౌకగా పేరు గాంచారన్నారు. గతంలో గాజువాక ఉన్నత పాఠశాల, ఆంధ్రా యూనివర్సిటీ మైదానాల్లో గద్దర్‌తోపాటు తాను సభా వేదికను పంచుకున్న మధుర సంఘటనలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గద్దర్ మృతి విప్లవ సాహిత్యానికి తీరని లోటని అన్నారు.

యర్రా అప్పారావుకు డిప్యూటీ సీఎం పరామర్శ



కె.జి.హెచ్‌లో అప్పారావును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: విశాఖ కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత యర్రా అప్పారావును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అతనితో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం అప్పారావు ఆరోగ్య స్థితిపై వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

కింతలి రోడ్డుకు మోక్షం

జాతీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేయాలంటే గ్రామీణ రహదారుల అభివృద్ధితోనే సాధ్యమని నమ్మిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే మాడుగుల నియోజకవర్గంలో దాదాపుగా 80 శాతానికిపైగా రోడ్లను పూర్తి చేసిన ఆయన ఇప్పుడు కింతలి రోడ్డుకు మోక్షం కల్పించారు.

- గత టీడీపీ పాలకుల తీరుతో అధ్వానం
- నేడు డిప్యూటీ సీఎం బూడి చొరవతో నిర్మాణం
- 40 గ్రామాలకు తొలగనున్న రవాణా కష్టాలు



నాడు అధ్వానంగా గోతులమయంగా ఉన్న కింతలి రోడ్డు



నేడు వెడల్పుగా వేస్తున్న కింతలి రోడ్డు

మాడుగుల: గత టీడీపీ పాలకులు నిర్లక్ష్య వైఖరితో కింతలి రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో గతుకులమయంగా మారింది. దాంతో 40 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం చొరవతో శరవేగంగా రోడ్డు నిర్మిస్తున్నారు.

మాడుగుల మండలంలో శంకరం, సీతమందల, అవురువాడ, గొప్పూరు, డి.గొటివాడ నుంచి రాజంపేట, కాగిత, పి. గదబూరు, వంటర్లపాలెం, ఎం. కోడూరు నుంచి మాడుగుల, గాదిరాయి నుంచి ఎం. కృష్ణాపురం, తదితర రోడ్లు ఇప్పటికే పూర్తి చేశారు. ప్రస్తుతం 40 గ్రామాల ప్రజలు మాడుగుల రావాలన్నా, విశాఖ, అనకాపల్లి తదితర పట్టణ ప్రాంతాల్లో ఆస్పత్రులకు ఇతర అవసరాలకు వెళ్లాలన్నా, కింతలి రోడ్డే ప్రధాన ఆధారం. గత టీడీపీ పాలకులు నిర్లక్ష్యం వల్ల ఈ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీనికి తోడు క్వారీ లారీలు అధిక లోడుతో రాకపోకలు సాగించడంతో కింతలి, ఘాట్‌రోడ్ మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

'గడపగడపకు' వచ్చి పరిశీలించి...

ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వయంగా కింతలి రోడ్డు పరిశీలించారు. అధ్వానంగా మారిన రోడ్డు చూసి విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే 24 గంటల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే పది కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. రోడ్డు వెడల్పు చేశారు. రోజూ రోడ్డు పనుల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. తొలుత ఘాట్ రోడ్ రోడ్ నుంచి పెద్ద పెద్ద గోతులు వద్ద మెటల్ వేసి బాగు చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఏళ్లనాటి తమ కల ఫలించిందని, డిప్యూటీ సీఎంకు 40 గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు.

రోడ్డు కష్టాలు తీరనున్నాయి



గత టీడీపీ పాలకులు పట్టించుకోకపోవడంతో మండలానికి ప్రధానమైన కింతలి రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్డు నిర్మిస్తుండటంతో మాకు రవాణా కష్టాలు తీరనున్నాయి.

– పెచ్చేటి లీలా, జంపెన గ్రామం

ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు. ఇప్పుడు మండలానికి ప్రధాన ఆధారమైన కింతిలి రోడ్డును బాగు చేస్తున్నారు. మా గ్రామం ప్రధాన రోడ్డు కిరువైపులా డ్రైనేజీలు వేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. గతంలో వర్షం కురిస్తే డ్రైనేజీ నీటితో నిండిపోయేది. ఇప్పుడా సమస్యకు చెక్ పడింది. మా గ్రామం తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– నేమాల గురువునాయుడు, సర్పంచ్, జంపెన, మాడుగుల మండలం

లంపీస్కిన్ బారిన పడకుండా టీకా



వారాడలో లంపీస్కిన్ నిరోధక టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి నాయుడు



పశువైద్యాధికారి అలేఖ్య

కె.కోటపాడు: ప్రస్తుతం తెలుపు రంగు పశువులు లంపీస్కిన్ బారిన పడే పరిస్థితి ఉండటం వల్ల టీకాలను వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. మండలంలోని వారాడ, యడ్లవానిపాలెం, చిరికివానిపాలెం గ్రామాల్లో పశువులకు లంపీస్కిన్ నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ వ్యాధి ప్రధానంగా తెలుపు రంగు పశువులైన ఆవులు, ఎద్దులకు సోకే పరిస్థితి ఉంటుందని తెలిపారు. శరీరమంతా దద్దుర్లు, అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం వస్తుందని, తద్వారా నీరసించి మేత మేయదని వివరించారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనే శక్తి పశువుకు కల్పించేందుకు వ్యాధి నిరోధక టీకాలను రైతులు తప్పకుండా వేయించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

4 నెలలు దాటిన పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు

దేవరాపల్లి: నాలుగు నెలలు వయసు దాటిన పశువులకు లంపీస్కిన్ (ముద్ద చర్మ) నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని దేవరాపల్లి పశు వైద్యాధికారి ఎస్. అలేఖ్య అన్నారు. ఈ నెలాఖరు వరకు టీకాలు వేస్తామన్నారు. మండలంలో లంపీస్కిన్ టీకాలు ఆరు వేలు డోస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రమాదకర లంపీస్కిన్ పట్ల నిర్లక్ష్యం వహించకుండా పశు వైద్యశాలలతోపాటు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పశు సహాయకులను సంప్రదించి టీకాలను వేయించాలని సూచించారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు



కశింకోటలో నూకాంబిక అమ్మ వారిని పెద్ద పూలమాలతో అలంకరించి నిర్వహిస్తున్న పూజలు



నూకాంబిక ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అష్ట లక్ష్మి విగ్రహాలు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారపు పొద్దు, ఉద్యోగులు, విద్యార్థులకు సెలవు రోజు కావడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పూలమాలలు, చీరలు, రవికెలు, అరటి గెలలు, తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కొందరు అమ్మ వారి జాతర జరిపి, అన్న సమారాధనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా అష్ట లక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటైన విగ్రహాలకు రంగులు వేసి, తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. వీటి ఏర్పాటుతో ఆలయం మరింత శోభాయమానం కానుందని భక్తులు భావిస్తున్నారు.

మహిళా పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట: హింసపై మహిళ పోరు యాత్ర కార్యక్రమం ముగింపులో భాగంగా ఈ నెల 8న విజయవాడలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం కశింకోటలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 28 నుంచి హింసపై మహిళల పోరు యాత్ర ప్రచార జాతా నిర్వహించినట్టు తెలిపారు. ఈ యాత్ర ముగింపులో భాగంగా విజయవాడలోని జింఖానా మైదానంలో బహిరంగ సభ జరగనుందన్నారు. సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మీనామృతం పంటలకు బలమైన టానిక్

ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న



కుంచంగిలో మీనామృతం తయారీ, ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: మీనామృతం(చేప ద్రావణం) అన్ని పంటలకు బలమైన టానిక్‌లా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న అన్నారు. మండలంలోని కుంచంగి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు మీనామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనినే ఫిష్ ఎమీనో యాసిడ్ అంటారని, ఇది మొక్కలకు పోషకాలను అందించడంతో పాటు భూసారాన్ని పెంపొందించి, చీడపీడల నివారణలో అద్భుతంగా పనిచేస్తుందన్నారు. మీనామృతం తయారీ కోసం కేజీ నల్ల బెల్లం, లీటరు నీరు, కేజీ చేప వ్యర్థాలు సరిపోతాయన్నారు. వీటిని 27 రోజులు నిల్వ ఉంచితే మీనామృతం తయారవుతుందన్నారు. ఇది 6 నెలలు నిల్వ ఉంటుందని పేర్కొన్నారు. చదువురాని రైతులు కూడా సులభంగా మీనామృతం తయారు చేసుకోవచ్చన్నారు. పెద్దగా ఖర్చు కూడా ఉండదన్నారు. తయారు చేసిన మీనామృతాన్ని వడపోసి పంటలకు పిచికారీ చేస్తే చీడపీడల యాజమాన్యంలో బాగా పనిచేస్తుందని తెలిపారు. పంట దిగుబడుల నాణ్యత కూడా చాలా బాగుంటుందన్నారు. మొక్కల పెరుగుదల దశలో దీనిని వినియోగించాలన్నారు. దీని వల్ల భూమిలో నత్రజని స్థిరీకరణ జరుగుతుందన్నారు. రైతులంతా రసాయన ఎరువుల వినియోగాన్ని వదిలి, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో కరణం వెంకటరమణ, సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి, పల్లెల నాగేశ్వర్రావు, పోలిన వరాహవెంకటలక్ష్మి, సత్యారావు, కె.కుమారి, వీరవతి, హేమలత పాల్గొన్నారు.

జిల్లాలో సెక్షన్ 30 పోలీసు చట్టం అమలు

15వ తేదీ వరకు ర్యాలీలు, బహిరంగ సభలు నిషేధిస్తూ ఉత్తర్వులు

మాడుగుల రూరల్: జిల్లాలో ఈ నెల 4వ తేదీ నుంచి సెక్షన్ 30 పోలీసు చట్టం అమలులో ఉందని ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు తెలిపారు. ఈ చట్టం ప్రకారం గ్రామాల్లో, పట్టణాల్లో బహిరంగ సభలు, ర్యాలీలు, నిరసన ర్యాలీలు సమావేశాలు, నిర్వహించకూడదన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ, పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 15వ తేదీ వరకు చట్టం అమలులో ఉంటుందన్నారు. అత్యవసరంగా సభలు, సమావేశాలు, నిరసన ర్యాలీలు, ఏర్పాటు చేయాలంటే ముందస్తుగా సబ్ డివిజన్ పోలీసు అధికారుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక బలగాలను మాడుగుల, ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో నిఘా ఉంచినట్లు తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

మాడుగుల రూరల్: జాతీయ నులి పురుగులు నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి ఎల్. శివప్రసాదపాత్రుడు ఆదివారం తెలిపారు. కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని 32 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు కళాశాలలకు చెందిన 6,500 మంది విద్యార్థులకు ఈ మాత్రలు మింగించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆదివాసీల పాదయాత్రకు మద్దతు

తుమ్మపాల: ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించి, అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు కోరారు. ఆదివాసీ సాగు రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలియజేస్తూ పట్టణంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సాగులో ఉన్న భూములపై వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం నుంచి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వరకు తలపెట్టిన పాదయాత్రకు మద్దతు తెలుపుతున్నామన్నారు. పట్టణంలో గుండాల జంక్షన్ వద్ద స్వాగతం పలుకుతామన్నారు. కార్యక్రమంలో సభ్యులు దొమ్మెసి సత్యారావు, ఇంటి చిన ఎల్లయ్య, నడుపూరి దేముడు, జగ్గారావు పాల్గొన్నారు.

నేడు పట్టణానికి ఆదివాసీ పాదయాత్ర

అనకాపల్లి రూరల్: జిల్లాలో నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉంటున్న గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఆదివాసీ పాదయాత్ర సోమవారం అనకాపల్లి పట్టణానికి చేరుకుంటుందని సీపీఎం సీనియర్ నేతలు ఎ.బాలకృష్ణ, ఐఆర్ గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గుండాల కూడలి వద్దకు సోమవారం ఉదయం 10.30 గంటల సమయానికి చేరుకోనున్న పాదయాత్రకు పార్టీ నేతలు, ప్రజాసంఘాల నాయకులు హాజరై ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.

పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి

అనకాపల్లి రూరల్: జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దొడ్డి రామానాయుడు కార్మిక కర్షక భవనంలో జరిగిన డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో విద్యార్హతలను బట్టి స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో 12 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా సీహెచ్ శివాజీ, కార్యదర్శిగా ఎస్వీ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షునిగా అల్లు రాజు, సహాయ కార్యదర్శులుగా ఎస్.నారాయణరావు, శివలు ఎన్నికయ్యారు.

గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఘన సత్కారం



బదిలీపై వెళ్లిన మహిళా పోలీసులను సత్కరిస్తున్న ఎస్ఐ నాగేంద్ర

దేవరాపల్లి: మండలంలో మహిళా పోలీసులు (గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు)గా పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ముగ్గురిని ఎస్ఐ డి. నాగేంద్ర ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరాపల్లి–1లో విధులు నిర్వర్తించిన గొర్లి వరలక్ష్మి రోలుగుంట మండలం కొవ్వూరు సచివాలయానికి, వేచలంలో పనిచేసిన కిలిమి సంతోషిమాత కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెంకు, ఏ.కొత్తపల్లిలో పనిచేసిన తాటికొండ విజయ విజయనగరం జిల్లా మధుపాడ సచివాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వీరిని ఎస్ఐ నాగేంద్ర, పోలీస్ స్టేషన్ సిబ్బంది, మండలంలోని సచివాలయ మహిళా పోలీసులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వీరి సేవలను ఎస్ఐ ప్రశంసించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడిన దుంగలు

నిలిచిన వాహనాల రాకపోకలు



ట్రాక్టర్‌కు ఇరువైపులా రోడ్డుపై పడిన దుంగలు

మాకవరపాలెం: వాహనం వెళుతుండగా కలప రోడ్డుపై పడిన ఘటనలో ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం మండలంలోని మల్లవరం నుంచి గిడుతూరు వైపు వస్తున్న కలప ట్రాక్టర్ తాళ్లు తెగిపోవడంతో ఒక్కసారిగా దుంగలు రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో వెనుక నుంచి ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. లేదంటే ట్రాక్టర్‌పై నుంచి దుంగలు పడి గాయపడే పరిస్థితి ఉండేది. ఈ దుంగలన్నీ రోడ్డుకు అడ్డంగా పడి ఉండటంతో సుమారు రెండు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి.

గ్రామాల్లో ముమ్మరంగా ఖరీఫ్ వరినాట్లు

మహిళా కూలీలకు పెరిగిన డిమాండ్



ఒమ్మలిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: గ్రామాల్లో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్దేరు, కోనాం జలాశయాలల్లో సాగునీరు విడుదల చేయడంతో రైతులు ఇబ్బడి ముబ్బడిగా వరినాట్లు వేస్తున్నారు. పెద్దేరు జలాశయం ద్వారా 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేస్తున్నారు. దీంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.400 నుంచి రూ. 500 వరకు, మగ కూలీలకు రూ.600 వరకు ఇస్తున్నారు. దీంతోపాటు దమ్ములు దున్నే ట్రాక్టర్లకు గంటకు రూ.900, ట్రిల్లర్లకు గంటకు రూ.600 వరకు డిమాండ్ ఉంది. మండలంలో 10,500 ఎకరాల్లో ఖరీఫ్ వరినాట్లు వేయడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాన్ని మించి ఈ ఏడాది వరినాట్లు వేయవచ్చని భావిస్తున్నారు.

ప్రమాదకరంగా తాండవ కాలువపై వంతెన

ధ్వంసమైన ఐరన్ గొట్టాల స్థానంలో కానరాని కొత్తవి



తాండవ కాలువలో వంతెనకు తాత్కాలికంగా అడ్డుగా పెట్టిన ఐరన్ గేట్లు

నాతవరం: లారీ ఢీకొట్టిన సంఘటనలో ధ్వంసమైన రక్షణ గోడ గొట్టాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. నాతవరం నుంచి తాండవ రిజర్వాయరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన వంతెనపై డివైడర్‌ను ఇటీవల లారీ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తాండవ కాలువపై వంతెనకు రక్షణ వలయంగా ఏర్పాటు చేసిన ఐరన్ గొట్టాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పట్లో వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తామని అధికారులు సమక్షంలో ప్రమాద కారకులు అంగీకరించారు. నెలలు దాటినా నేటికీ ఎలాంటి ప్రమాద నివారణ చర్యలు చేపట్టలేదు. ఈ రోడ్డుపై తాండవ రిజర్వాయరుకు వెళ్లే సందర్శకులు, ప్రయాణికులు తరుచూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నెల తాండవ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారు. ఆ సమయంలో కాలువలో నిండుగా రిజర్వాయరు నీరు ప్రవహిస్తుంది. వంతెనకు రక్షణగా ఉండే ఐరన్ గొట్టాలు ఏర్పాటు చేయకపోతే ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. ప్రస్తుతం ప్రమాదాలు వాటిల్లకుండా స్థానికులు ఐరన్ బారికేడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్‌ను వివరణ కోరగా.. వంతెనకు ఐరన్ గొట్టాలు శిథిలమై కావడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని, ఈ సమస్య తన దృష్టిలో ఉందన్నారు.

పోలీసుల ఆత్మీయ సమ్మేళనం



కశింకోటలో 1990 బ్యాచ్ పోలీసుల ఆత్మీయ కలయిక

కశింకోట: కశింకోటలో పోలీసుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. సుమారు 33 ఏళ్ల స్నేహ మాధుర్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. 1990 బ్యాచ్‌లో ఉద్యోగంలో చేరిన జిల్లాకు చెందిన పోలీసు కానిస్టేబుళ్లు స్థానిక పీఏసీఎస్ వద్ద ఉన్న విల్లాలో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, శిక్షణ సమయంలో తమ పరిచయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణ, అనారోగ్యం తదితర కారణాల వల్ల మృతి చెందిన పోలీసు సోదరులకు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ విషయాల గురించి పరస్పరం తెలుసుకున్నారు. సహపంక్తి భోజనం చేశారు. అంతా కలిసి ఫోటోలు దిగారు. ఆటపాటలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, అనిల్, సుబ్బారాజు, సాయి, ముబారక్, బోని శ్రీనివాసరావు, రఘు, శంకరరావు, నాయుడు, నరసింగరావు, వాసు భీశెట్టి వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, పూర్ణ, అనంత్ హాజరయ్యారు.